


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 224 శుక్రవారం 23 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -2 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# కాంగ్రెస్ హామీలు నీతి మాటలు నీటి మూటలు



- అబద్ధపు హామీలతో కాలం గడిపేస్తున్నారు
- రైతులను మోసం చూస్తే భవిష్యత్తు ఉండదు
- ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చాలి
- తక్షణమే 2 లక్షల రుణమాఫీ చేయాలి
- లేదంటే రైతుల పక్షాన పోరాటానికి సిద్ధం
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు






**వరంగల్ బ్యూరో, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2 లక్షల రూపాయల రుణమాఫీ నిరసన సెగ అగ్గిరాజుకుంది. జిల్లాలలోని నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేటీఆర్ ఆదేశానుసారం నాయకులు, కార్యకర్తలంతా రోడ్లపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు, సాధ్యం కానీ హామీలను ప్రవేశపెట్టి ప్రస్తుతం ప్రజల్ని మోసం చేయాలని చూస్తోందన్నారు. ఆగస్టు 15 లోపు పూర్తిస్థాయిలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు రైతులను విస్మరిస్తుందన్నారు. అధికారంలోకి ఇచ్చేంతవరకు రకరకాల హామీలను ప్రవేశపెట్టి నీతి మాటలు నీటి మూటలు అన్న సామెత ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులను కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తూ, మోసం చేయాలని చూస్తే, ఏ పార్టీకైనా, ఎంతటి నాయకుడికైనా భవిష్యత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణ రైతంగం వ్యవసాయాన్ని పండగలా భావించి, వ్యవసాయం చేసేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. వ్యవసాయ సాగు కోసం సాగునీటిని అందించడంతోపాటు 24 గంటల విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. సకాలంలో నాణ్యమైన ఎరువులు విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి ఏ ఒక్కరోజు రైతులు విమర్శించే పరిస్థితి ఏర్పడిన సందర్భాలు లేవని వివరించారు. అలాంటి రైతన్నను మోసం చేయాలని చూస్తే, రైతుల పక్షాన నిలబడి, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసేంతవరకు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రైతులను దగా చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేంత వరకు బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం రాయపర్తి మండల కేంద్రంలో ఆంక్షలు లేకుండా రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారిపై రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ ఎం శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రుణమాఫీ ఎగ్గొట్టి, రైతులతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. మొదటగా రైతు రుణమాఫీకి 49,500 కోట్లు అవసరమని చెప్పి, మళ్లీ మాట మార్చి, కేబినెట్లో 31 వేల కోట్లు సరిపోతాయని మరోమారు చెప్పి, మళ్లీ మాట మార్చి బడ్జెట్లో కేటాయించింధని అన్నారు. కేవలం 26 వేల కోట్లు మాత్రమే, అదికూడా మూడు విడతల వారీగా చివరగా చేసిన రుణమాఫీ కేవలం 17 వేల కోట్లు మాత్రమే అన్నారు. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి, రైతులను మోసం చేస్తున్న విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు మాజీ మంత్రి ఎర్రబెల్లితో పాటు తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతుకు ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతుల పట్ల చిన్నచూపు చూస్తూనే ఉందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కనీసం పంట పండించుకునేందుకు, రైతులకు సాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం దిగివచ్చి పూర్తిగా రుణమాఫీ చేసి, రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవా రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, రైతు బంధు మాజీ అధ్యక్షులు ఆకుల సురేందర్ రావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎండి నయీామ్, ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచులు గారే నర్సయ్య, కోదాటీ దయాకర్, కుక్కల భాస్కర్, చెడుపాక కుమార్, గాదె రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐత రాం చందర్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ పూర్తి స్థాయిలో మాఫీ చేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో మాఫీ చేయకుండా ఆంక్షలు పెడుతున్నారని నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా ప్రధాన రహదారిపై భారీ ధర్నాను చేపట్టారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి పత్తి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం రైతులకు రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆంక్షలు పెడుతూ రాష్ట్రంలో సగం మందికి కూడా రుణమాఫీ అమలు చేయకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున ఈ ధర్నా ఆరంభం మాత్రమేనని హెచ్చరించారు. ముఖ్యమంత్రి మాట, మంత్రుల మాట పూటకో మాట లెక్క ఉందని అన్నారు. ఆగస్టు నెల పూర్తవుతున్న రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇవ్వకపోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో రైతులకు రుణమాఫీకి అర్హులుగా ఉంటే, దీనిలో సగం మందికైన రుణమాఫీ అమలు కాకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలుపరిచని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతులకు అండగా పోరాడుతామన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండీ రఫీ, మాజీ సర్పంచులు కుమారస్వామి జయ జనార్ధన్ పార్టీ సీనియర్ నాయకులు యాకయ్య, వెంకటేశ్వర్లు, కందిక విజయ్, సాదు నర్సింగరావు, సాంబయ్య, బోడ మురళి నాయక్, మూడు రమేష్, సుదర్శన్, దేవ్ సింగ్, జంగిలీ కిరణ్, నవీన్, సుదర్శన్, సతీష్, సాగర్, రాజేందర్ రాజు, పసునూరి నవీన్, రాజకుమార్, మంజు, దంజి బాబురావు, యాకూబ్, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



రాయపర్తి, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం చక్రు తండా, మైలారం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయం అందించారు. బానోత్ లక్ పతి తల్లి బానోత్ జామిలి అనారోగ్యంతో మృతి చెందారు. వారి ఆర్థిక ఇబ్బందుల దృశ్యావారి కుటుంబానికి ఒక క్వింటా బియ్యం, నిత్యవసర సరుకులు అందించి, వారి సహృదయాన్ని నిరూపించుకున్నారు. దీంతో తండావాసులు వారి సహాయ సహకారాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తండావాసులు అంతా వీరి స్పందించి ఓ రైతు కాడెడ్లు 1,50,000 ఖరీదు చేసే మూడు ఎడ్లు యూరియా కలిపిన నీటిని త్రాగి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇలాంటి ఆపత్కాల పరిస్థితిలో ఎస్సార్ ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఒక రైతు బిడ్డగా వారిని ఆదుకోవాలని 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాదావత్ సమ్య నాయక్ కుటుంబ సభ్యులకు అందించారు.రాయపర్తి మండల గ్రామాలలో ఉన్న నిరుపేద కుటుంబాలలో ఎవరు ఆపదలో ఉన్న నేనున్నానంటూ వారికి కావాల్సినంత చేయూతను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లేతకుల మధుకర్ రెడ్డి, అశోక్, గబ్బెట బాబు, కోల సంపత్, సంధి దేవేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు తండావాసులు, కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు..

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మర్నేని



వర్ధన్నపేట, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన దోపతి ఎల్లయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎల్లయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన దాడి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి దశ దినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## గవర్నర్ పర్యటనకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



వరంగల్ బ్యూరో, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 28న, జిల్లా పర్యటన నేపథ్యంలో పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28న, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రముఖ రచయితలు, కళాకారులు, వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో గవర్నర్ పరస్పరంగా చర్చిస్తారని తెలిపారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాలలోని ఖిలా వరంగల్, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, పద్మాక్షి దేవాలయం, ఇతర స్థానిక ప్రముఖ ప్రదేశాలను సందర్శిస్తారని కలెక్టర్ అన్నారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే కలెక్టర్ తమ దృష్టికి తీసుకురావాలన్నారు.
ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని ఆదేశించారు. ముఖ్యంగా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తి ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నేతలు శ్రవణ్




రాయపర్తి, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల ఎస్సై శ్రావణ్ కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నేతలు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైని శాలువాతో సన్మానించి, శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, పెండ్లి మహేందర్ రెడ్డి, మందాటి సుదర్శన్ రెడ్డి, ఏసి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మచ్చ నిలయ, చిర్ర మల్లయ్య, ఉల్లెంగుల నర్సయ్య, ఎండి గౌస్ ఖాన్, గుగులోత్ యాకూబ్, పిరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరువు భత్యం వెంటనే విడదల చేయాలి

**- యాబై శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి ప్రకటించాలి**

**- పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్**



వర్ధన్నపేట, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన 5 డిఏలను విడుదల చేస్తూ, 50 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి ప్రకటించాలని పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వర్ధన్నపేట మండల పరిధిలోని చెన్నారం, నల్లబెల్లి, ఉప్పరపల్లి, కట్రియాల, ఇల్లంద ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ రికాగనైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం ప్రాథమిక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భముగా జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కరువు బత్యాలను వెంటనే విడుదల చేయాలన్నారు. 50 శాతం ఫిట్మెంట్ తో వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న జీపీఫ్. టిఎస్జిఎల్ఐ ఉపసంహారణలకు సంబందించిన బకాయిలు, మెడికల్ రీ ఇంబర్స్మెంట్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమములో పిఆర్టియు వర్ధన్నపేట మండల అధ్యక్షులు నిమ్మ మనుజేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు కోనపురం గ్రామంలో వైద్య శిబిరం

**- మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- వైద్యాధికారి డాక్టర్ సరోజ**



చెన్నారావుపేట, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామంలో నేడు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సరోజ ఓ ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఆదేశానుసారం నర్సంపేట మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొనాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో జనరల్ పిజిషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, చర్మవ్యాధి నిపుణులు, ఈఎన్టి, చిన్న పిల్లల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులతో పాటు వైద్య నిపుణుల బృందం వస్తున్నారని ఇచ్చారు. ఇలా అనుభవం కలిగిన వైద్య నిపుణుల సమక్షంలో అందించనున్న వైద్య సేవలు మండల ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుమీద

**- చెన్నారావుపేట ఎంపీపీ అరుణ**



చెన్నారావుపేట, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండలం తిమ్మరాయనపాడు గ్రామంలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుమీద అనే కార్యక్రమాన్ని గురువారం ఎంపీఓ అరుణ ప్రారంభించారు. గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మ పేరు మీద చెట్టు నాటడం అనేది ఒక వరమని చెప్పారు. చెట్లు నాటడమే కాదు వాటిని పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. అమ్మ లాలన ఎంత హాయిగా ఉంటుందో, పెరిగిన చెట్టు నీడ అంతే హాయిగా ఉంటుందన్నారు. మొక్క నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ సింగ్, కార్యదర్శి మమత, అంగన్వాడి టీచర్ అరుణ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి, ఆశా కార్యకర్త రజిత, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు తల్లి పేరుమీద మొక్క నాటాలి




రాయపర్తి, ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): ప్రతీ ఒక్కరూ తల్లి పేరు మీద మొక్కను నాటాలని డివిజనల్ పంచాయతీ అధికారి వేదవతి అన్నారు. గురువారం రాయపర్తి మండలం మైలారం గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుమీద అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీపీఓ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కను నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, కార్యదర్శులు విజేందర్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నిరంగాల్లో కాంగ్రెస్ సర్కార్ విఫలం

## సరైన సమయంలో కెసిఆర్ ప్రజల్లోకి వస్తారు

**పంచాయితీ ఎన్నికల నిర్వహణకు భయపడుతున్న కాంగ్రెస్**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు**



హైదరాబాద్,ఆగస్టు 22,(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు విమర్శించారు. సర్కార్ వైఫల్యాలను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని.. సరైన సమయంలో ఆయన ప్రజల్లోకి వస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్లో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం పంచాయితీ ఎన్నికలకు వెళుతుందని అనుకోవడం లేదని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. 'బీసీ కులగణన చేసిన తర్వాత ఎన్నికలకు వెళ్తామని కాంగ్రెస్ చెప్పింది. సెప్టెంబర్ రెండో వారం నుంచి హామీ అమలుచేయాలని నిరసనలు తెలుపుతాం. సంపూర్ణ రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. మేం అడగకపోతే ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వదు. రైతులు తిరగబడతారనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిరలో ఇవాళ జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. భట్టి చెప్పినట్లు రైతుల ఖాతాల్లో కేవలం రూ.7 వేల 500 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. బీఆర్ఎస్ సర్కార్ దిగిపోయే సమయానికి రెవెన్యూ మిగులు రూ.5 వేల 300 కోట్లు ఉంది. అసెంబ్లీ సమావేశాల్లో రెవెన్యూ మిగులుపై ప్రభుత్వాన్ని నిలదీశాం. కానీ సీఎం రేవంత్ రెడ్డి బజారు భాష మాట్లాడి విషయాన్ని పక్కదోవ పట్టించారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. అదానీ సంస్థలను కేసీఆర్ తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదని కేటీఆర్ అన్నారు. 'అదానీ విషయంలో రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డికి తేడాలు ఉన్నాయి. ఆయనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం. అదానీ కంపెనీతో పాత బస్తీలో కరెంటు బిల్లులు వసూలు చేయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న చోట అదానీ కంపెనీకి అవకాశం కల్పిస్తున్నారు. తెలంగాణ తల్లి అంటే అందరికి రోల్ మోడల్. సెక్రటేరియట్ ముందు రాష్ట్ర ప్రజలకు ఆమోదయోగ్యమైన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ బిడ్డ అంజయ్యను అవమానించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సచివాలయం ముందు ఎలా పెడతారు. తెలంగాణ చరిత్రలోంచి కేసీఆర్ని ఎవరూ చెరిపేయలేరు. ముఖ్యమంత్రిగా రేవంత్ సాధించిన రికార్డ్ ఏదైనా ఉందా అంటే అది ఢిల్లీకి వెళ్లడమే. సీఎంగా ఇప్పటివరకు ఆయన 20 సార్లు దేశరాజధానికి వెళ్లారు. ఇదొక్కటే రేవంత్ సాధించిన ఘనత' అని కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రం సిద్ధించినా.. కాంగ్రెస్ పాలనలో పరాయి పాలకుల ఛాయలు కనిపిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. 'అసెంబ్లీ మీడియా సలహాదారు ప్రసన్న కుమార్, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వి, తెలంగాణ ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర అధ్యక్షుడు.. వీళ్లందరు ఏ రాష్ట్రానికి చెందిన వారు? కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఒక్క రాజ్యసభ సభ్యుడు దొరకలేదా? అభిషేక్ మను సింఘ్వి తెలంగాణ గురించి మాట్లాడితే ఎనిమిది మంది ఎంపీలు ఏం చేస్తారు? మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ ఒక్క సీటూ మాదిగలకు ఇవ్వలేదు' అని కేటీరామారావు విమర్శించారు.